క్లుప్తంగా

ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమం తప్పదు

కలసపాడు : ఎన్నో రకాల ఉద్యమాలను ముందుండి నడిపించిన మాతృ సంఘం ఎస్టీయూ అని, ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని ఆ సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి హెచ్చరించారు. సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, ప్రసాద్ ఆధ్వర్యంలో కలసపాడులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌బాబు, సత్యనారాయణ ,ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడు సేవలు మరువలేనివి

మైదుకూరు : ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు శీలంబుట్టాగాండ్ల సుబ్బరాయుడు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఎస్‌బీ సుబ్బరాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ మైదుకూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతుల లేమి కారణంగా తక్కువ మంది విద్యార్థులతో నడుస్తున్న సమయంలో ఎకనామిక్స్ అధ్యాపకుడు సుబ్బరాయుడు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు పీవీ కృష్ణారెడ్డి, రాధారామ్, అనురాధ లక్ష్మి తదితరులు ఉద్యోగ విరమణ పొందిన సుబ్బరాయుడును శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు.

పూడికతీత పనులు

చాపాడు : మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో సోమవారం డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీలు అధ్వానంగా ఉండటంతో సర్పంచ్ సరోజమ్మ, పంచాయతీ కార్యదర్శి సుమలత జేసీబీ చేత పూడిక తీత పనులు చేపట్టారు. ఇదే క్రమంలో దెబ్బతిన్న మంచినీటి కుళాయిలకు మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలు!

- పోట్లదుర్తిలో హైటెన్షన్
- మద్యంషాపు వద్ద స్వల్ప వాదులాట
- రెచ్చగొట్టి దాడికి పాల్పడిన సురేష్‌నాయుడు వర్గీయులు
- ఆపై పోట్లదుర్తిలో ఉద్రిక్తత.. పరస్పర రాళ్లదాడులు
- సకాలంలో స్పందించిన పోలీసు బలగాలు

సాక్షి ప్రతినిధి, కడప : అధికార బెత్తం పట్టుకొని ఓ సామాజిక వర్గాన్ని అక్కడ అణగదొక్కారు. వారందర్నీ ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తిస్తూ తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరించారు. ఇటీవల గ్రామ దేవత పెద్దమ్మ ఆలయం ప్రాంగణం మొత్తానికి ప్రహరీ నిర్మించాలని వారు పట్టుబట్టారు. చేస్తున్న తప్పును తప్పు అన్నందుకు వివక్ష మరింత అధికమైంది. ఆపై అధికార మదం తోడైంది. ఫలితంగా వెంటవెంటనే కవ్వింపు చర్యలు తెరపైకి వస్తున్నాయి. క్రమం తప్పకుండా వాదులాటలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి పోట్లదుర్తిలో పరస్పర రాళ్లదాడులు తెరపైకి వచ్చాయి. పోలీసులు సకాలంలో స్పందించడంతో కాస్తా ఉపశమనం దక్కినా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో హైటెన్షన్ నెలకొంది. తాగుబోతుల మధ్య నెలకొన్న స్వల్ప వాదులాట చిలికి చిలికి గాలి వాన లాగా మారి రెండు సామాజిక వర్గాల మధ్య పెద్ద వివాదంగా మారింది. పరస్పరం రాళ్ల దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. వైన్ షాపులో మద్యం సేవిస్తున్న ఇరువురు ఆ తర్వాత ఖాళీ బాటిల్‌ను వెనుకకు వేశారు. ఆ వైపు ఉంటూ మద్యం సేవిస్తున్న మరో ముగ్గురు బాటిల్ మా వైపు ఎందుకు వేశారంటూ గొడవ పడ్డారు. చూడకుండా చేసిన పొరపాటును సీరియస్‌గా తీసుకోవద్దని అక్కడి వారు సర్ది చెప్పారు. అంతటితో వదిలేసి ఉంటే సరిపోయేది. ఊర్లో మీ కథ పెద్దదైంది. మీకు దిక్కున్నచోట చెప్పుకోండంటూ పరుష పదజాలంతో దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మొదలయ్యాయి.

సురేష్‌నాయుడుపై తిరుగుబాటు..

వైన్ షాపులో చోటుచేసుకున్న వివాదం పోట్లదుర్తి గ్రామంలో సీఎం సురేష్‌నాయుడు ఇంటిపై తిరుగుబాటుగా మారింది. ఎంతకాలం మీ దౌర్జన్యాలను భరించాలంటూ మరో సామాజిక వర్గం ఆదివారం అర్ధరాత్రి తర్వాత సురేష్‌నాయుడు ఇంటిపై రాళ్ల దాడులు చేశారు. ఈ క్రమంలో పరస్పర రాళ్ల దాడులు తెరపైకి వచ్చాయి. సుమారు గంట పాటు సురేష్‌నాయుడు ఇంటి సమీపంలో రాళ్ల దాడులు చోటుచేసుకున్నాయి. గ్రామస్థుల సమాచారం మేరకు ఎర్రగుంట్ల పోలీసులు సకాలంలో గ్రామానికి చేరుకొని ఉద్రిక్తతలను శాంతింపజేశారు. ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. కవ్వింపు చర్యల కారణంగా ఉత్పన్నమైన ఘర్షణ రెండు సామాజిక వర్గాలకు అంటుకుంది. దీనికి కారణం.. తమకు అడ్డు లేదు అనుకున్న సందర్భంలో పెద్దమ్మ దేవాలయం ప్రాంగణానికి మొత్తం ప్రహరీ నిర్మించాలని కొందరు పట్టుబట్టడమే. వెరసి ఇలాంటి వివాదాలు తరచూ తెరపైకి వస్తున్నాయని పలువురు వివరిస్తున్నారు. అధికారులు వారి విధులను పైరవీలకు తలొగ్గకుండా నిబద్ధతతో నిర్వర్తిస్తే ఇలాంటివి ఉత్పన్నం అయ్యే అవకాశం లేదు. ప్రశాంత వాతావరణం ఉన్న గ్రామాల్లో సమస్యలకు మూల కారకులుగా అధికారులు మారుతుండటం గమనార్హం. పోట్లదుర్తిలో పోలీసు పికెట్ కొనసాగుతున్నా వ్యవహారం నివురు గప్పిన నిప్పులా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికైనా నిక్కచ్చిగా వ్యవహరించి కవ్వింపు చర్యలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పోట్లదుర్తిలో ఆదివారం అర్ధరాత్రి తిష్టవేసిన పోలీసులు

శివారెడ్డి ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నిరంతరం శ్రమజీవుల పక్షాన, అంతరాలు లేని సమాజం కోసం పరితపించిన, కపటం లేని ప్రముఖ సామాజిక కార్యకర్త, సీహెచ్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పుత్తా శివారెడ్డి(65) ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటని పలువురు రాజకీయ, సామాజిక, అభ్యుదయ, స్వచ్ఛంద సంస్థల నేతలు పేర్కొన్నారు.

సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన శివారెడ్డి భౌతికకాయానికి నగరంలోని బాలాజీ నగర్‌లోని ఆయన నివాసంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం శక్తికి మించి శివారెడ్డి పని చేశారన్నారు. సమాచారం పొందడం ప్రజల హక్కు అని రహస్యాలు లేని పరిపాలన కోసం సమాచార హక్కు చట్ట రక్షణకు కృషి చేశారన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాతంత్ర ఉద్యమాలలో భాగస్వామ్యం అయ్యేవారన్నారు. ఎన్నికల్లో అక్రమాలు అరికట్టేందుకు ఎన్నికల నిఘా వేదికలో సభ్యులుగా తమ వంతు పాత్ర నిర్వహించేవారన్నారు. రిమ్స్‌లో శివారెడ్డి మరణించిన కొద్ది సమయంలోనే వారి కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ కు నేత్రదానం చేశారు. శివారెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం రిమ్స్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దేహ దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ, హేతువాద సంఘం నాయకులు సిఆర్వీ ప్రసాద్, నాగార్జున రెడ్డి, విరసం వరలక్ష్మి, శ్రీనివాసుల రెడ్డి, ప్రజానాట్యమండలి, నాస్తిక సంఘం నేత పల్లవోలు రమణ, లోక్ సత్తా శ్రీకృష్ణ, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, రాయలసీమ ఎస్సీ ,ఎస్టీ మానవ హక్కుల వేదిక నాయకులు జేవీ రమణ, రిటైర్డ్ అధికారులు గోపాల్, ఫణిరాజు, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ రామచంద్రయ్య, అడ్వకేట్ సంపత్ కుమార్, పౌర హక్కుల సంఘం నేతలు ఉన్నారు.



సామాజిక కార్యకర్త శివారెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నేతలు

నేడు బక్కాయపల్లెకు ఎంపీ అవినాష్‌రెడ్డి

ఖాజీపేట : మండల పరిధిలోని బి.కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని బక్కాయపల్లె గ్రామానికి మంగళవారం ఉదయం 8గంటలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నారు. ఇటీవల బక్కాయపల్లె గ్రామానికి చెందిన రైతు పత్తి రామచంద్రారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకానున్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా



అల్యోంక రెడ్డిని అభినందిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఎడిఫై పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని అల్యోంక రెడ్డి జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరిచింది. ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అండర్-18 కిలోల విభాగంలో రాష్ట్రం తరపున పాల్గొని కాంస్య పతకం సాధించింది. ఈ విద్యార్థిని పాఠశాల చైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎలియా అభినందించారు.

ఆర్యవైశ్య సభ నూతన కార్యవర్గం ఎన్నిక

వరుసగా 8వ సారి అధ్యక్షుడిగా ఎన్నికైన బుశెట్టి రాంమోహన్‌రావు



నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావుతోపాటు కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య సభ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ ఎన్నికల్లో ఆర్యవైశ్యులు 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వారందరు కలసి ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిని ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్యవైశ్యసభభ అధ్యక్షునిగా బుశెట్టి రాంమోహన్ రావు, ఉపాధ్యక్షునిగా జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శిగా మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మల్లెంకొండు ప్రతాప్, కోశాధికారిగా జాలాధి పరమేష్‌లను ఎన్నుకున్నారు. రెండవ మైసూరుగా ఖ్యాతి గడించిన ప్రొద్దుటూరులో దేవీశరన్నవ రాత్రి వేడుకలను ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలు నిర్వహించడంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య సభకు మంచి గుర్తింపు ఉంది. ఆర్యవైశ్య సభ అధ్యక్షునిగా ఎన్నికైన బుశెట్టి రాంమోహన్ రావు 1994లో సభ మెంబరుగా ఎన్నికయి, 2001లో ఉపాధ్యక్షునిగా సేవలందించి 2004 నుంచి వరుసగా 8వ సారి అధ్యక్షునిగా ఎన్నికవడం విశేషం. గతంలో కొప్పరవు సుబ్బయ్య వరుసగా 25 ఏళ్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. రాంమోహన్ రావు హయాంలోనే వాసవీ మాతకు బంగారు రథం, బంగారు చీరె, వజ్రపు చీర, కిరీటం, పాశాంకుశాలు తదితర వజ్ర, బంగారు ఆభరణాలతో పాటు అమ్మవారికి రోజూ విశేష పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ఉచిత హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఆప్కాబ్ ద్వారా వ్యాపారులకు రూ.2కోట్లు మంజూరు చేయించారు. 50 మంది ఆర్యవైశ్యులకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షునితో పాటు నూతన కమిటీకి ఆర్యవైశ్య ప్రముఖులతో పాటు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

గర్భిణి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : విధుల్లో నిర్లక్ష్యం వహించి గర్భిణి మృతికి కారకులైన తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బద్వేలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు పిచ్చయ్య, కేశవయ్య మాట్లాడుతూ అనంతరాజపురం పంచాయతీ గుండం రాజుపల్లె గ్రామానికి చెందిన పెంచలమ్మ ఇంటి వద్ద ప్రసవించిన అనంతరం తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో కుటుంబ సభ్యులు తొట్టిగారిపల్లె పీహెచ్‌సీకి తీసుకెళ్లారని తెలిపారు. సకాలంలో పూర్తి స్థాయి వైద్యం అందక పెంచలమ్మ మృతి చెందిందన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి స్పందించి గర్భిణి మృతికి కారకులైన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యం.చిన్ని, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షరీఫ్, పట్టణ నాయకులు ప్రసాద్, సీపీఐ పట్టణ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : సీపీఐ 25వ జిల్లా మహాసభలను జులై 22, 23, 24 తేదీలలో బద్వేలులో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ, అపరెల్ పార్కు, ప్రొద్దుటూరు పాలకేంద్రం, చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, రాష్ట్ర విభజన హామీల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై, నీటి ప్రాజెక్టుల పట్ల పాలకుల నిర్లక్ష్యం వంటి కీలక అంశాలపై జిల్లా మహాసభల్లో చర్చిస్తామన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే ఫిర్యాదులను పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆమె అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి

జిల్లాలో ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి చేకూర్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సంతృప్తికరమైన ఆర్థిక పరిపుష్టిపై మూడు నెలలపాటు జిల్లాలో క్యాంపెయిన్ నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, బ్యాంకింగ్ రంగం ప్రచురించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో జేసీ ఆవిష్కరించారు.

కడప-నెల్లూరు ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం



74 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ తోషిత్ యాదవ్



4 వికెట్లు తీసిన కడప జట్టు బౌలర్ చరణ్



108 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ రిహాన్




4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ టీవీ సాయి ప్రతాప్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు సోమ వారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రా రంభించిన నెల్లూరు జట్టు 69.3 ఓవర్లకు 232 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 116 బంతుల్లో 74 పరుగులు, ఇకాషర్ 44 పరుగులు చేశారు. కడప జట్టులోని చరణ్ 4 వికెట్లు, నాగకుల్లాయప్ప 2 వికెట్లు, ధీరజ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 18 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 129 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు విఘ్నేష్ 53 పరుగులు, రణధీర్ రెడ్డి 47 పరుగులు చేశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లకు 189 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి చరణ్ 55 పరుగులు, లోహిత్ లక్ష్మీ నారాయణ 33 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. వరుణ్ సాయి నాయుడు 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 39 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఆ జట్టులోని రిహాన్ చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 103 బంతుల్లో 108 పరుగులు చేశాడు. హమీమ్ 38 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3 వికెట్లు, మంజునాథ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు



అండర్-17లో విన్నర్స్‌గా నిలిచిన హైదరాబాదు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ బీ-జోన్ , సీఐఎస్‌సీఈ ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ జోనల్ త్రోబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ త్రోబాల్ క్రీడాకారుడు డి. రేవంత్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, క్రమశిక్షణ, జట్టు సమన్వయం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా -అండర్-17 విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కడప , ద్వితీయ స్థానంలో శ్రీ వేద ఇంగ్లీష్ మీడియం స్కూల్ మదనపల్లి.

అండర్-14 విభాగంలో విజేతలుగా స్విస్ రిఫరల్ హాస్పిటల్ స్కూల్ పలమనేరు, రన్నరప్ లు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప, మూడవ స్థానం స్టెమ్ పబ్లిక్ స్కూల్, గుంటూరు నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్ అమిత్ సింగ్ ఈ పోటీల్లో విజయం సాధించిన జట్లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, రహమతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేపల్లిలోనే పాఠశాల కొనసాగించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కడప సెవెన్‌రోడ్స్ : అట్లూరు మండలం చెన్నేపల్లె ప్రాథమిక పాఠశాలను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు, విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఎస్.వెంకటాపురం పాఠశాలలోకి తరలించాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చెన్నేపల్లెలోనే కొనసాగించాలన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.


సగిలేరు పాఠశాలను తరలిస్తే ఆందోళన చేపడతాం



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలను బ్రహ్మంగారిమఠంలోని మహా గురుకుల పాఠశాలకు తరలిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్దన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ సగిలేరు గురుకుల పాఠశాలను యధావిధిగా అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1983లో ఏర్పడిన సగిలేరు గురుకుల పాఠశాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అలాంటి పాఠశాలను బి.మఠంలోని తోట్లపల్లె వద్ద ఉన్న మహా గురుకులంలో విలీనం చేయాలని భావించడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్ణయాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీపీఏ నాయకుడు భాస్కర్, ఏఐఎస్‌బీ రాయలసీమ కన్వీనర్ రాజేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై విచారణ



గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీలో విచారిస్తున్న డీఎంహెచ్‌ఓ

బద్వేలు అర్బన్ : తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చి బాలింత మృతి చెందిన ఘటనపై సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీలో సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో కాన్పులు చేయడం చాలా ప్రమాదకరమని, ఎలాంటి శిక్షణలేని మంత్రసానులు ఇళ్లల్లో సొంతంగా కాన్పులు చేయకూడదని తెలిపారు. ప్రతి కాన్పు ఆసుపత్రిలోనే జరగాలని, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకొని వెళ్లేందుకు 108 ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు సరైన సమయంలో మెరుగైన వైద్యం అందించి మాత శిశు మరణాలు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బంది పైన ఉందన్నారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు, మృతురాలి బంధువులను అడిగి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఏ. ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది ఖాజామొహిద్దీన్, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఆదివారం అర్ధరాత్రి ఓ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మైదుకూరు రోడ్డు వైపున ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ ధ్వంసమయ్యాయి. రేణిగుంట నుండి బద్వేలు మీదుగా గోపవరం సమీపంలోని సెంచూరి పరిశ్రమకు కలప లోడుతో వెళుతున్న లారీ నాలుగురోడ్ల కూడలిలోకి వచ్చేసరికి మలుపు తిప్పుకుంటూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఢీ కొట్టింది. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ



సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనపరచిన వేద వ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. రెండవ సెమిస్టర్ బీఎస్సీలో లోకేశ్వర్ 9.75, మానస, షేక్‌లైబా 9.42, సూర్యప్రకాష్‌యాదవ్, సుబ్బమ్మ 9.0, బీకాంలో సాబీనా 9.42, అనిత, రబియా 9.25, హరిత, నౌజియా, షరీస్ 9.17, నాలుగవ సెమిస్టర్ బీఎస్సీలో కీర్తన, మన్వితారెడ్డి 9.40, సాజిద రెహమాని, అమృతవర్షిణి 9.15, మెహనూర్ భాను 9.05, బీకాంలో అపర్ణ 9.25, పూజిత, అభినయ, కరిష్మా 8.85, భారతి 8.65 జీపీఏ సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రామలక్ష్మీరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

కాంట్రాక్టర్లకు 15 నెలలుగా బిల్లులు లేవు

మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ కాంట్రాక్టర్లకు గత 15 నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ సభాభవనంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి 2023 మార్చి నాటికి మున్సిపాలిటీలో పూర్తిగా బిల్లులు క్లియర్ చేశారన్నారు. కాంట్రాక్టర్లకు రూ.24 కోట్లు బకాయిలు రావాల్సి ఉండగా గత 15 నెలలుగా ఎవ్వరికీ డబ్బు రాలేదన్నారు. కేవలం కంటితుడుపు చర్యగా రూ.30లక్షలు మాత్రమే జమ చేశారన్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపి కాంట్రాక్టర్ల బిల్లులు తయారు చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. బిల్లులు పంపాక కూడా ప్రభుత్వం మంజూరు చేయకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నిస్తామన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంజూరైన రూ.150కోట్ల డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులు, రూ.120 కోట్లతో మంజూరైన పైపులైన్ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని తిరిగి మంజూరు చేయించాల్సిన బాధ్యత నేటి పాలకులపై, అధికారులపై ఉందన్నారు. మార్కెట్ నిర్మాణ పనులకు సంబంధించి గతంలో రూ.22కోట్లు మంజూరు కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక పనులను ఆపేశారన్నారు. మిగిలిన రూ.30 కోట్లు మంజూరు చేయించి పనులను ప్రారంభించాలన్నారు. ఎస్ఎస్ మాల్ నిర్మాణానికి రూ.5.85 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని, వెంటనే ఈ మొత్తాన్ని వసూలు చేయాలని తెలిపారు.

కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ చెత్త వాహనాలను తొలగించడంతో మున్సిపాలిటీలో చెత్త నిల్వలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయన్నారు. వీటిపై ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్‌ను కోరారు. వైఎంఆర్ కాలనీలోని టీబీ కాంప్లెక్స్ వెనుకవైపున ఉన్న 8 సెంట్ల మున్సిపాలిటీ స్థలం కబ్జాకు గురవుతోందన్నారు. ఈ సమస్య పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లిందన్నారు. పుట్టపర్తి సర్కిల్‌లోని శ్రీనిధి పాలకేంద్రానికి సంబంధించిన కంటైనర్‌ను వెంటనే తొలగించాలని సభ్యులు కోరగా కమిషనర్ అంగీకరించారు. ఇందుకు సంబంధించిన ఎంక్రోజ్‌మెంట్ ఫీజు అడ్వాన్స్‌గా ఉందని ఏసీపీ చెప్పడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవిధంగా అడ్వాన్స్ ఫీజు తీసుకున్నారని సభ్యులు ప్రశ్నించడంతో తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ మైదుకూరు రోడ్డులో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్ పనులకు సంబంధించి ఫుట్ పాత్‌లు నిర్మించడంతో కాలువల్లో పూడిక తీయడానికి ఇబ్బందిగా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నది కేవలం మాటల ప్రభుత్వమే అని చేతల ప్రభుత్వం కాదని అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలను సమష్టిగా ఎదుర్కొంటాం



కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వ అరాచకాలు, కక్ష పూరిత చర్యలను సమష్టిగా ఎదుర్కొంటామని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేసిన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి చెందిన ఇంటిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చడం సరైంది కాదన్నారు. శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, బి.కోడూరు సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బద్వేలు, అట్లూరు మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల జిల్లా నాయకులు బ్రహ్మానందరెడ్డి, రమేష్‌బాబు, సాయి నారాయణరెడ్డి, కౌన్సిలర్ ఓబుళరెడ్డి, సర్పంచ్ వేణు, ఉపసర్పంచ్ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు వినతి

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ మాకొద్దు అని పుల్లారెడ్డిపల్లె ఉపాధి పథకం కూలీలు సోమవారం ఎంపీడీఓ మహబూబ్‌బీకి వినతి పత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పని చేసిన వారికి ఆరు రోజులకు 5 రోజులు, 4 రోజులు, 3 రోజులు పని చేసినట్లు, పనికి రాని వారికి వారానికి రూ.1500-1600 వేతనాలు ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తన ఇంటి వద్దే మస్టర్ పెట్టుకుని తనకు సంబంధించిన వారి పేర్లు రాసుకుని ఆ నిధులను స్వాహా చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడగగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు తెలిపారు. మీరు చేసే పనికి ఇంతకంటే ఎక్కువ రాదని తమను దబాయిస్తున్నాడని అన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ

చాపాడు : గత నెల 29న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలంలోని నరహరిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు కేఎల్ నరసింహ శాస్త్రీ సోమవారం తెలిపారు. హ్యాండ్ బాల్ పోటీలలో హైస్కూల్‌కు చెందిన జ్ఞాన అక్షిత సాయి, మంజు, సుబ్బలక్ష్మి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి ఎంపికయ్యారు. తమ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంతి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు/ప్రొద్దుటూరు క్రైం : బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని మహిళా సంరక్షణ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు వారు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట హోం మంత్రి చిత్రపటంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో నిర్వహించిన బదిలీల ప్రక్రియలో స్పౌజ్ కోటాలో అనర్హులకు ర్యాంకు లేకపోయినా కోరుకున్నచోటికి బదిలీ చేశారని వారు తెలిపారు. అర్హత ఉన్న వారికి మాత్రం మొండి చెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

గురుకుల పాఠశాల పరిశీలన

బి.కోడూరు : మండలంలోని సగిలేరు ఒడ్డున గల అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను కడప డీసీవో ఉదయశ్రీ సోమవారం పరిశీలించారు. మౌలిక వసతులు సరిగా లేకపోవడం వలన సగిలేరు గురుకుల పాఠశాలను బి.మఠం మండలంలోని తోట్లపల్లె సమీపాన ఉన్న గురుకుల పాఠశాలలో విలీనం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దీనిపై గత కొద్ది రోజులుగా విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మండల నాయకులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో సోమవారం నాయకులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. అక్కడ ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలపై పాఠశాల సిబ్బందితో, విద్యార్థులతో చర్చించారు. అనంతరం డీసీవో ఉదయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ ఉన్న వసతులు, విద్యార్థుల సంఖ్యపై నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల గురించి ఆశాఖా మంత్రి వీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులను మంజూరు చేయించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎట్టిపరిస్థితిల్లోనూ పాఠశాల ఇక్కడ నుంచి తీసివేయకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి ఓ.రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు ఓ.రమణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి ఓ.రమణారెడ్డి, మున్నెల్లి సర్పంచ్ గుర్రయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ రామయ్య, నాయకులు రాంమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనిపించే దేవుడు వైద్యుడు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యుడికే ఉంది. సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. సాక్షాత్తు దేవుడులాంటివాడివంటూ హృదయ పూర్వకంగా నమస్కారం చేస్తారు. అందుకే ఆయనను ‘వైద్యో నారాయణో హరి’ అంటూ గౌరవిస్తారు. భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ వైద్య రంగం అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య కల్పనకు విశేషమైన కృషి చేశారు. ఆయన సంస్మరణార్థం ప్రతి ఏటా ప్రభుత్వం జూలై 1వ తేదీన నేషనల్ డాక్టర్స్ డేను నిర్వహిస్తున్నారు. వైద్యులు ఆ మహనీయుడి స్ఫూర్తితో వైద్య రంగంలో రాణిస్తున్నారు. వైద్యులకు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో కొన్ని విశేషాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక వీధివీధే డాక్టర్‌తో నిండి ఉంది. దాదాపు వంద మీటర్ల పొడవునా ఇరువైపుల ఆ వీధంతా డాక్టర్లు, వైద్యశాలలు, ల్యాబొరేటరీలు, మందుల దుకాణాలు ఉన్నాయి. దాన్ని క్రిస్టియన్‌లేన్‌గా వ్యవహరిస్తున్నా నిజానికి దాన్ని డాక్టర్స్ వీధి అనాల్సి ఉంది. రేయింబవళ్లు ఈ వీధిలో రోగులను తరలించే అంబులెన్స్‌లు కనిపిస్తూనే ఉంటాయి. రోగులకు విశేష సేవలు అందిస్తున్న వైద్యులకు వైద్యుల దినోత్సవ సందర్భంగా పలువురు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

పశువైద్య కళాశాలలో శిక్షణ

ప్రొద్దుటూరు : మండలంలోని పశువైద్య కళాశాలలో సోమవారం హైదరాబాద్ జాతీయ మాంస పరిశోధన సంస్థ సౌజన్యంతో పశువులకు మిశ్రమ దాణా తయారీ – ఉపయోగాలు అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పశువుల నుంచి వచ్చే పాల ఉత్పత్తుల ద్వారా రైతులకు స్థిరమైన ఆర్థిక, ఉపాధి భరోసా పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చన్నారు. పశుపోషణ విభాగం అధిపతి డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రాజకిశోర్, డాక్టర్ ఇందిర, డాక్టర్ త్రివేణి, డాక్టర్ జ్ఞాన చరిత, డాక్టర్ భార్గవి, డాక్టర్ విజయకుమార్‌లు పశువుల పెంపకంలోని మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, మాధవరం, కొర్రపాడు, నక్కలదిన్నె, బద్వేలు, గోపవరం, పోట్లదుర్తి ప్రాంతాల నుంచి 45 మంది రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : గాంధీ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్‌లో మంగళ, బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హాస్పిటల్ జనరల్ మేనేజరు నరసింహారావు తెలిపారు. కార్డియాలజిస్ట్ రాజశేఖరవర్మ, ఎముకలు, నరాల సంబంధ వైద్యుడు హరీష్‌బాబు, డాక్టర్ నాగశేఖర్‌రెడ్డి వైద్యసేవలు అందిస్తారన్నారు.